క్లుప్తంగా

ప్రసన్న ఇంటిపై దౌర్జన్యకాండ హేయం



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు (పొగతోట): మాజీ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి మహిళలపై అపార గౌరవముందని, ప్రతి మహిళనూ అమ్మ అని పిలుస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల పేర్కొన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో సంఘీభావం తెలిపిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇంటిపై దాడులు చేసి గందరగోళం సృష్టించారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తే పూలు.. రాళ్లు పడుతుంటాయని, సహించి ఓర్పుగా ఉండాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అనుచరుడు తనపై వివాదాస్పద వ్యాఖ్య చేశారని, అప్పుడు మహిళనే విషయం గుర్తుకురాలేదానని ప్రశ్నించారు. పోలీస్ అధికారులపై పూర్తిస్థాయిలో నమ్మకం ఉందని, కారకులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలని కోరారు. దాడి జరిగిన ఏడో తేదీని బ్లాక్ డేగా అభివర్ణించారు. మీ తల్లి ఉన్న ఇంట్లో ఇదే విధంగా ఎవరైనా దౌర్జన్యానికి పాల్పడితే ఏమి చేస్తారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రశ్నించారు. అనంతరం పార్టీ నేత సంపూర్ణమ్మ మాట్లాడారు. గతంలో మంత్రులు రోజా, రజనిలపై తప్పుడు కూతలు కూశారని ఆరోపించారు. ప్రసన్న ఉంటే హత్య చేసేందుకు ముందుగానే సిద్ధపడి మారణాయుధాలతో వచ్చారన్నారు. పార్టీ బుచ్చిరెడ్డిపాళెం నేత సునీత, కోవూరు జెడ్పీటీసీ శ్రీలత, మాజీ కార్పొరేటర్ వెంకట జ్యోతి, షకీలాబేగం, పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు లక్ష్మిసునంద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



కొడవలూరు: పీఎం మాతృత్వ శిశు సంరక్షణ యోజనలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. 26 మంది గర్భిణులకు పరీక్షలు చేయగా, ఆరుగురికి రక్త శాతం తక్కువగా ఉందనే అంశాన్ని గుర్తించారు. ఐరన్ ఇంజెక్షన్‌తో పాటు ఐరన్, క్యాల్షియం మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రామకృష్ణ మాట్లాడారు. పీహెచ్‌సీలకు గర్భిణులు ప్రతి నెలా తొమ్మిదిన వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. హెచ్‌ఎస్ సుజాత, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎస్సెన్ వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ మండలంలో 5,957 మంది రైతులను అన్నదాత సుఖీభవకు అర్హులుగా గుర్తించామన్నారు. అన్నదాతలు తమ పొలాల్లో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఇనమడుగులో పొలం పిలుస్తోంది



కోవూరు: మండలంలోని ఇనమడుగు, చెర్లోపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రజని మాట్లాడారు. అన్నదాతా సుఖీభవ పథకంలో నగదు జమ కావాలంటే తమ భూమిని ఆధార్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. సహాయకులు శిరీష్, మెహరున్నీసా పాల్గొన్నారు.

భక్తులకు యూత్ రెడ్‌క్రాస్ సేవలు

నెల్లూరు(అర్బన్): బారాషహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండగకు వస్తున్న భక్తులకు యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వలంటీర్లు సేవలను బుధవారం అందించారు. స్నానాల ఘాట్ల వద్ద స్వల్ప గాయాలైన పిల్లలు, వృద్ధులను అక్కడి ప్రాథమిక చికిత్స కేంద్రాలకు తీసుకొచ్చి వైద్యసేవలందేలా చేశారు. డాక్టర్లు రంజని, రమాదేవి, ప్రియాంక, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- శిథిలావస్థకు చేరినా పట్టించుకోరా?
- పెరుగుతున్న ప్రమాదాలు



వరకవిపూడి సమీపంలో ప్రమాదాలకు నిలయంగా మారిన వంతెన

తోటపల్లిగూడూరు: మండలంలోని ప్రధాన రహదారులపై ఉన్న పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయపడుతున్నారు. నరుకూరు – కోడూరు మార్గంలో విలుకానుపల్లి, కోడూరు సమీపాల్లో ఉన్న వంతెనలు, నరుకూరు – తోటపల్లి గూడూరు మార్గంలో నరుకూరు సమీపంలో ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. అలాగే వరకవిపూడి, చిన్న చెరుకూరు, మల్లికార్జునపురం గ్రామాల సమీపాల్లో ఉన్న మరో మూడు కూడా దుస్థితిలో ఉన్నాయి. పంట కాలువలపై దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెనలకు కాలం చెల్లడంతో ఏ క్షణాన కూలుతాయే తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా పడిపోతే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతోపాటు ప్రాణనష్టం వాటిల్లే అవకాశముంది.

ఇరుకుగా..

వంతెలను వెడల్పు చేయకపోవడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లే అవకాశం లేదు. ఓ వాహనం ముందు వెళ్తే ఎదురుగా వచ్చే మరో వాహనం వంతెన ముందు కాసేపు ఆగాల్సిందే. అలా కాదని సాహసం చేసి ముందుకు కదిలితే ప్రమాదాన్ని కొని తెచ్చుకొన్నట్లే. ఈ నేపథ్యంలో వంతెనల వద్ద రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్తవి నిర్మించాలని స్థానికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



చిన్నచెరుకూరు సమీపంలో..



మల్లికార్జునపురం సమీపంలో శిథిలావస్థకు చేరిన వంతెన



విలుకానుపల్లి సమీపంలో ఉన్న వంతెన వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్)

కాకాణి పూజిత పరామర్శ

మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అవుల మనోహర్‌రెడ్డి తండ్రి శ్రీనివాసులురెడ్డి మృతిచెందారు. వారి కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పరామర్శించారు. ముందుగా శ్రీనివాసులురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, కసిరెడ్డి ధనంజయరెడ్డి, జానకిరామిరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పూజిత

పీటీఎంకు ప్రత్యేకాధికారుల నియామకం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పేరెంట్ – టీచర్ మీట్‌కు సంబంధించి ప్రతి పాఠశాల పరిధిలో ప్రత్యేకాధికారులను నియమించామని ఎంపీడీఓ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నిర్వహించనున్న సమావేశానికి తల్లిదండ్రులు తప్పక హాజరుకావాలని కోరారు.

పశుగ్రాస వారోత్సవాలు

ఇందుకూరుపేట: పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకొని కొత్తూరులో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడీ మురళీకృష్ణ, ఇందుకూరుపేట ప్రాంతీయ పశు వైద్యశాల సిబ్బంది రాజేశ్వరి, రమేష్, మౌనిక, శ్రీను, ట్రెయినీ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్, టీచర్ మీటింగ్ నేడు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని 3,422 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన విజయాలను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్సులో ప్రగతి నివేదికను అందజేయనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు టగ్‌ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, రంగోలి వంటి ఆటల పోటీలను నిర్వహించనున్నారు. ప్రతి విద్యార్థికి ఒక మొక్కను అందజేసి వారి పరిసరాల్లో నాటే విధంగా చర్యలు తీసుకోనున్నారు.

అల్లరిమూక అర్ధగంట బీభత్సం



ప్రసన్న ఇంట్లో ధ్వంసం చేసిన వస్తువులు (ఫైల్)

- ప్రసన్న ఎక్కడా అంటూ బూతులతో వీరంగం
- తలుపులు తీయకపోతే చంపేస్తామని బెదిరింపు
- శ్రీలక్ష్మమ్మను చూసుకోవడంతోనే సరిపోయింది
- ఘటనను వివరించిన సహాయకులు

కోవూరు: మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో అల్లరిమూకలు అర్ధగంట పాటు బీభత్సాన్ని సోమవారం సృష్టించారని ప్రసన్న తల్లి శ్రీలక్ష్మమ్మకు తోడుగా ఉండే అలీమా, సెక్యూరిటీ గార్డు ఖాజావలీ, సహాయకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. దారుణాన్ని చూస్తూ ఏమి చేయాలో పాలుపోలేదంటూ విషయాన్ని వారు తెలియజేశారు. ఏమి జరుగుతోందో తెలుసుకునేలోపే ఇంట్లో ధ్వంసం చేశారని, అడ్డుకునేందుకు యత్నిస్తే చంపేస్తామంటూ బెదిరించారని చెప్పారు. శ్రీలక్ష్మమ్మను కాపాడుకోవాలనే ఉద్దేశంతో అల్లరిమూకలు చెప్పినట్లే చేశామన్నారు. దాదాపు వంద మంది యువకులు మారణాయుధాలతో ప్రవేశించారని, సీసీ కెమెరాల వైర్లను కట్ చేసి.. వాటిని ధ్వంసం చేసి గేట్‌ను తోసుకొని లోపలికి చొచ్చుకొచ్చారని తెలిపారు. అందర్నీ చంపేస్తామని దాడికి తెగబడ్డారని, ఈలోపు మెయిన్ డోర్ తలుపులను తెరిచామని పేర్కొన్నారు. ఇంట్లోని అన్ని గదుల్లోకి తిరిగి, వస్తువులను కిందపడేసి ధ్వంసం చేశారని చెప్పారు. మహిళలు దాడి చేశారని చెప్పడం అబద్ధమని, అందరూ యువకులేనని స్పష్టం చేశారు. శ్రీలక్ష్మమ్మను మరో గదిలోకి తీసుకెళ్లి తలుపులేశామన్నారు. ప్రసన్న ఎక్కడున్నారు.. ఎక్కడున్నా చంపేస్తామంటూ తమను బెదిరించారని, కుమారుడితో కలిసి బయటకెళ్లారని చెప్పినా, బూతులు తిట్టారన్నారు. కారును బోల్తా కొట్టించి.. పూలకుండీలేస్తూ.. రాడ్లు, సుత్తులతో ధ్వంసం చేశారని చెప్పారు. పోలీస్ జీపు వచ్చినా, వారెదురుగానే తమ ఫోన్లు తీసుకొని వెళ్లిపోయారన్నారు. ఖాకీలకు విషయాన్ని తెలియజేయగా, వారిని గుర్తుపడ్తావా.. వారిని ఎప్పుడైనా చూశావా అంటూ ఓ అధికారి తమను ప్రశ్నించి.. మరింత ఆందోళనకు గురిచేశారని ఆరోపించారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- కలెక్టర్ ఓ ఆనంద్

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన అవగాహనా సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు గ్రూపుల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రూపు సభ్యులు డేటా పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రుణాల చెల్లింపులను వంద శాతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రూపు సభ్యులకు రుణ పరిమితిని పెంచి జీవన ప్రమాణాలు పెంచేందుకు మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో రైతులు, మత్స్యకారులు, పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను విరివిగా అందించాలన్నారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమను క్రమబద్ధీకరణ పథకం ద్వారా రెడీ టు ఈట్, రెడీ టూ కుక్ పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. ఈ యూనిట్ల స్థాపనపై స్వయం సహాయక మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయించాలని, గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి రుణాలు సకాలంలో మంజూరు చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకు ముందు లబ్ధిదారులకు సబ్సిడీపై కేటాయించిన పిండిమిల్లు, చపాతి తయారీ యంత్రాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, ఎల్‌డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, పశు సంవర్ధక శాఖ జేడీ రమేష్‌నాయక్, మత్స్యశాఖ అధికారి చాన్‌బాషా, జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, బ్యాంకు అధికారులు, డీఆర్‌డీఏ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఓ ఆనంద్

ఓటర్ల వివరాలు తెలుసుకోవాలి

- తహసీల్దార్ శివకృష్ణయ్య

పొదలకూరు: బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలు తెలుసుకుని మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని తహసీల్దార్ బి.శివకృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లు మృతిచెంది ఉంటే జాబితా నుంచి తొలగించాల్సిందిగా పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు సర్వేను చేపడుతున్నట్టు తెలిపారు. ఏఎస్ఓ రఫీఉద్దీన్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 73 మంది బీఎల్వోలున్నారని తొలి విడతలో 50 మంది బీఎల్వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

మండల స్థాయి అధికారులకు శిక్షణ

పొదలకూరు: మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు బుధవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డీవీ నరసింహారావు మాట్లాడుతూ పంచాయతీ పురోగతి సూచిక, 2025 – 26 యాక్షన్ ప్లాన్ తదితర అంశాలపై మాట్లాడారు. పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వివరించారు.

➡ ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీఓ నాగమణి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగమణి

వినతుల సమర్పణకు 12 తుది గడువు

కొడవలూరు: అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించిన అర్హుల జాబితాలో పేరు లేని వారు వినతులను సమర్పించేందుకు తుది గడువు ఈ నెల 12 అని కోవూరు ఏడీఏ అనిత తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మండలంలో 8156 మందికి గానూ 7250 మంది రైతులను అర్హులుగా గుర్తించామని చెప్పారు. ఇప్పటికే 570 మంది రైతులు వినతిపత్రాలను సమర్పించగా, రికార్డులను రెవెన్యూ అధికారులకు పంపామని వివరించారు. కౌలు రైతులకు సంబంధించిన సైట్ ఓపెనైందని, ఈ క్రమంలో సీసీఆర్ కార్డులను చేయించుకోవాలని కోరారు. ఏఓ విజయలక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు మౌర్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

కోడూరులో తమ్ముళ్ల మధ్య విభేదాలు

తోటపల్లిగూడూరు: మండలంలో మేజర్ పంచాయతీ అయిన కోడూరులో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తలనొప్పిగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కోడూరు పంచాయతీలో యాదవ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు బాధ్యతలు అప్పగించారు. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఆయనపై అలకబూనారు. ఎంతో కాలంగా పార్టీని నమ్ముకుని ఉంటే తమను విస్మరించి కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యతనిస్తున్నాడని కొందరు సీనియర్ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలకు దిగారు. ఈ నేపథ్యంలో పంచాయతీలో ఎలాంటి పనులు చేయకుండానే బిల్లులు చేయించుకుని అవినీతికి పాల్పడ్డాడని సదరు నేతపై కార్యకర్తలు సోషల్ మీడియాలో ప్రచారం ప్రారంభించారు. దీంతో కలత చెందిన ఆ నేత పార్టీలో తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై మంగళవారం సోమిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అయితే ప్రధాన నాయకుడి వల్ల తమకు జరుగుతున్న అన్యాయంపై కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి కార్యాలయానికి చేరుకుని వివరించారు. ఈ తెలుసుకున్న ఆయన తన అనుచరులతో కలిసి కోడూరులో విలేకరుల సమావేశం నిర్వహించి తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిపై విరుచుకపడ్డాడు. కొందరు దొంగలు కోడూరు పంచాయతీలో పార్టీని నాశనం చేసేందుకు తనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న నేతలు

కార్మిక వ్యతిరేక చట్టాల రద్దుకు డిమాండ్

- సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



పొదలకూరులో ర్యాలీ

పొదలకూరు: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, హమాలీలు, ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఇది స్థానిక గేటుసెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తున్నట్టు విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. 12 గంటల పనివిధానానికి స్వస్తి పలికి 8 గంటలు కొనసాగించాలన్నారు. అనంతరం తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నేతలు బి.మనోహర్, స్వర్ణలత, పుష్పవేణి, ప్రమీల, లక్ష్మీలత, వెంకటేశ్వర్లు, అంకయ్య, మహేంద్రగౌరీ, అనిల్, కిరణ్ పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు(పొదలకూరు): సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ముత్తుకూరులో బుధవారం బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. నాయకులు గడ్డం అంకయ్య, గోగుల శీనయ్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, పోర్ట్‌లో కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగించాలని, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

➡ మనుబోలు: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం నాయకుడు దేవదానం డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా బుధవారం జరిగిన అంగన్‌వాడీల ర్యాలీ, మానవహారంలో నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆదిశేషయ్య, కె.శేషయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైనట్లు ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మారుబోయి రాజా తెలిపారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు మండలంలోని పలు రొయ్యల హేచరీలను, పరిశ్రమలను మూసివేయించేశారు. అనంతరం మహాలక్ష్మీపురం సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ సమ్మెలో భాగంగా జిల్లాలోని అన్ని రొయ్యల ఫ్యాక్టరీలకు సమ్మె నోటీసులు ఇవ్వడంతో వారు సహకరించినట్లు చెప్పారు. సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య, ఆటో యూనియన్ నాయకులు నాశిన పరుశురామయ్య, ఆరణి గోపి, శివ, చింతా రామసుబ్బయ్య, చింతా శ్రవంత్, జడ్డా లెనిన్, నక్కల శీనయ్య, మన్నెం శీనయ్య, కందిపాటి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని సీఐటీయూ మండల కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా పట్టణంలో నిరసన ర్యాలీని సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ మండలాధ్యక్షుడు మునీర్ అహ్మద్, అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు శేషమ్మ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: పట్టణంలోని బజార్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీని రైతులు, భవన నిర్మాణ కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ మామిళ్లపల్లి మోహన్‌రావు, శేషయ్య, బుజ్జయ్య, విజయకుమార్, సుజాతమ్మ, హరిబాబు, పెద్దబ్బయ్య, అఫ్రోజ్, సుబ్బారావు, రమేష్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నేత గోనె దయాకర్ డిమాండ్ చేశారు. నార్తురాజుపాళెంలో భారీ నిరసన ర్యాలీని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. సీఐటీయూ మండల కార్యదర్శి నరసింహ, అంగన్‌వాడీ సంఘ జిల్లా నేత విజయమ్మ, ఆటో యూనియన్ నేత సురేష్, సీఐటీయూ నేతలు దేవానంద్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో నిరసన ర్యాలీ



కోవూరులో..



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..